రక్తదానం ప్రాణదానం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: అన్నిదానాల్లోకి రక్తదానం మిన్నగా చెప్పవచ్చని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. రక్తదాన దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ఏరియా వైద్యశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్త దానం చేయటం వలన ఎంతో మంది ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉందని తెలిపారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, ఎంపీడీఓ రాధాకృష్ణ, రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.ఎస్.నారాయణభట్టు ఉన్నారు.

యువకుడిని తల్లిదండ్రులకు అప్పగింత

కొల్లూరు: తల్లిదండ్రులు మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన యువకుడిని సురక్షితంగా వారి తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొల్లూరు జగ్జీవన్‌రామ్ కాలనీకి చెందిన సుద్దపల్లి రమేష్ కుమారుడు విజయ్‌కుమార్ కొల్లూరులోని ఐటీఐ కళాశాలలో చదువుతున్నాడు. ఈనెల 11వ తేదీ స్నేహితులతో కలసి అర్ధ రాత్రి వరకు తిరగడంతో తల్లిదండ్రులు మందలించారు. 12న కళాశాలకు వెళుతున్నట్లు చెప్పి వెళ్లిన యువకుడు ఇంటికి తిరిగిరాలేదు. అదే రోజు వేరే ఊరు వెళ్లిన తల్లిదండ్రులు 13న ఇంటికి వచ్చారు. ఇంటి వద్ద కుమారుడు లేకపోవడంతో ఎక్కడకి వెళ్లాడోనన్న అనుమానంతో పరిసర ప్రాంతాలలో వెతికారు. అదే సమయంలో విజయ్‌కుమార్ తన తండ్రికి ఫోన్ చేసి తాను రాజమండ్రిలో ఉన్నానని, తన వద్ద డబ్బులు లేవని పంపించాలని, ఓ దుకాణదారుడి ఫోన్ నుంచి కాల్ చేశాడు. వెంటనే యువకుడి తండ్రి కొల్లూరు పోలీసుస్టేషన్‌కు చేరుకుని విషయాన్ని ఏఎస్‌ఐ రామయ్యకు తెలపడంతో ఆ దుకాణదారుడితో మాట్లాడిన ఏఎస్‌ఐ, యువకుడిని అక్కడే ఉంచాలని సూచించడంతోపాటు, రాజమండ్రి పోలీసులకు సమాచారం అందజేశారు. అక్కడి పోలీసులు యువకుడిని తమ వద్ద ఉంచుకుని కొల్లూరు పోలీసులకు సమాచారం అందజేయడంతో వెంటనే యువకుడి తండ్రితో కలసి రాజమండ్రి వెళ్లి యువకుడిని తీసుకువచ్చినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. అయితే యువకుడి ఆచూకీ తెలియడంతో దీనిపై ఎటువంటి కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు.

శ్మశానవాటికకు హద్దుల నిర్ధారణ

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరంలో హిందూ శ్మశానవాటిక ఏర్పాటుకు సంబంధించి హద్దులు కేటాయించారు. ఎంతో కాలంగా శ్మశానవాటిక లేకపోవడంతో ఇటీవల గ్రామస్థులు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున దృష్టికి తీసుకువెళ్లారు. మంగళవారం రేపల్లె ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి గ్రామానికి విచ్చేసి స్మశానవాటిక స్థలాన్ని పరిశీలించారు. 40 సెంట్ల స్థలంకు సంబంధించి హద్దులు నిర్ధారించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం వీఆర్‌ఓలు పి.లీలాగ్రేసమ్మ, రత్నాకర్, గ్రామ సర్వేయర్లు రమేష్, వెంకటేష్ స్థలానికి సంబంధించిన హద్దులను నిర్ధారించారు. సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ మాచర్ల హేమసుందరరావు, పంచాయతీ వార్డు సభ్యులు గట్టు శ్రీనివాసరావు, దేవరకొండ నాగార్జున, బట్టు బసవనాగేశ్వరరావు, జొన్నాదుల శరత్, మాచర్ల శోభనబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఫైనల్ దశకు చేరిన క్రికెట్ టోర్నమెంట్



కొల్లూరు: వైఎస్సార్ స్మారక క్రికెట్ టోర్నీ పోటీలు ఫైనల్‌కు చేరుకున్నట్లు టోర్నీ నిర్వాహకుడు, బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు మేరుగ చందన్‌నాగ్ బుధవారం పేర్కొన్నారు. కొల్లూరు బాలురు, బాలికోన్నత పాఠశాల క్రీడా మైదానంలో వేమూరు నియోజకవర్గస్థాయి హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలలో మొత్తం 96 జట్లు పాల్గొనగా, పలు దశలలో జరిగిన పోటీలలో నెగ్గుకుంటూ వచ్చిన మూడు జట్ల నడుమ గురువారం ఉదయం క్వాలిఫయర్1, 2 పద్ధతిలో పోటీలు నిర్వహించి, మధ్యాహ్నం నుంచి ఫైనల్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా బుధవారం జరిగిన పోటీలలో రాణించిన క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, ఓడిన జట్లకు ప్రోత్సాహక బహుమతి రూపంలో క్రికెట్ బ్యాట్లను ఆయన పంపిణీ చేశారు.

సీఎం జగన్ చిత్రపటానికి విద్యార్థుల క్షీరాభిషేకం



బాపట్ల అర్బన్: విద్యాభివృద్ధి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కృషి చేస్తూ, విద్యతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని భావించి విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు యలవుల సోహిత అన్నారు. పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం విద్యార్థులకు విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

నిజాంపట్నం: ఓఆర్ఎస్ ద్రవం శక్తిని, బలాన్ని యధాస్థితికి తీసుకువస్తుందని హెల్త్ సూపర్‌వైజర్ మురళి తెలిపారు. మండలంలోని కొత్తపాలెం పంచాయతీలో బుధవారం 5 సంవత్సరాలలోపు పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ మురళి మాట్లాడుతూ కూచినపూడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఓఆర్ఎస్, జింక్‌ని సరైన చికిత్సగా వైద్యులు సిఫార్సు చేస్తారని తెలిపారు. నీళ్ళ విరోచనాలు తరువాత ఓఆర్ఎస్‌ను తప్పనిసరిగా చిన్నారులకు అందించాలని తెలిపారు. అతిసారవ్యాధి సమయంలో పిల్లలకు 14రోజుల పాటు జింక్‌మాత్రమే ఇవ్వాలని చెప్పారు. ఈ సందర్భంగా ఓఆర్ఎస్ వల్ల కలిగే ప్రయోజనాలను, తయారీ విధానాన్ని వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.











విద్యార్థులకు రక్తదానంపై అవగాహన


రక్తదాన శిబిరంలో మాట్లాడుతున్న పేర్లి సునీల్, వేదికపై రత్నాకర్

బాపట్ల అర్బన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని సుశీల స్కూల్ ఆఫ్ నర్సింగ్ కాలేజ్ చైర్మన్ పేర్లి సునీల్ అన్నారు. సుశీల స్కూల్ ఆఫ్ నర్సింగ్ కాలేజ్‌లో బుధవారం గ్రామ సిరి ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాన దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పేర్లి సునీల్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితిలో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడడం చాలా ముఖ్యమన్నారు. రక్తదానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ కె.రత్నాకర్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ప్రాణాలు కాపాడిన వారమవుతామన్నారు. ప్రతి ఆరు నెలలకొకసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. పీపీటీసీటీసీ కౌన్సిలర్ ఎస్.నాగరాజ కుమారి మాట్లాడుతూ పరీక్షించి శుభ్రపరిచి ఉన్న రక్తాన్ని ఎక్కించాలన్నారు. వీహెచ్ఎస్ టి.రమేష్ రక్తదానం చేయటం వలన వచ్చే ప్రయోజనాల గురించి, రక్తదానంపై ఉన్న అపోహల గురించి అవగాహన కల్పించారు. గ్రామసిరి ప్రాజెక్ట్ మేనేజర్ కె.వెంకటరావు మాట్లాడుతూ రక్తదానం చేయటం చాలా ప్రాముఖ్యమైన్నారు. ప్రస్తుతం యువత అన్ని రంగాలలో ప్రముఖ పాత్ర వహిస్తున్నారని, యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. వికాస్ ఎడ్యుకేషనల్ అకాడమీ డైరెక్టర్ షేక్ నజీర్ మాట్లాడారు. ఈసందర్భంగా పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు. డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్ షేక్ బాజీతునిషా , గ్రామసిరి ఎం అండ్ఈ కె.శ్రీనివాసరావు, ఓఆర్‌డబ్ల్యూఎస్ కె.హేమలత, ఒ.లక్ష్మీ, బీఎల్ సుష్మా, షేక్ మస్తాన్ బి.గ్రామసిరి సిబ్బంది, కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బడుగు వికాసంతో నిరుద్యోగులకు ఉపాధి

– డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి బొంత అర్జునరావు

వేమూరు: జగనన్న బడుగు వికాసం ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం జరుగుతుందని బాపట్ల జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి బొంత అర్జునరావు తెలిపారు. వేమూరు మండల పరిషత్ కార్యాలయంలో వేమూరు నియోజక వర్గం స్థాయిలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల ఏపీఎంలు, సీసీలు, వీఓలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు బ్యాంక్‌లు ద్వారా వ్యవసాయం, పశు సంవర్థక శాఖలు, హార్టికల్చర్ శాఖలు యాన్యువల్ యాక్షన్ ప్లాన్ స్కీములు సబ్సిడీపై వివరాలు గురించి తెలిపారు. జీవనోపాధికి కూడా బ్యాంక్ ద్వారా రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. జగనన్న బడుగు వికాసం పథకంలో నిధులు పుష్కలంగా ఉన్నాయని, గ్రామాల్లో యానియేటర్లు నిరుద్యోగులను గుర్తించి వారి జీవనోపాధికి సబ్సిడీ రుణాలు ఇప్పించాలన ఆయన ఆదేశించారు. ఏపీఎంలు బ్యాంక్‌ల మేనేజర్లతో మాట్లాడి ప్రతి నిరుద్యోగికి సబ్సిడీ రుణాలు ఇప్పించాలని ఆయన ఆదేశించారు. వేమూరు, చావలి, పెరవలి, జంపని, చదలవాడ, గ్రామాలకు చెందిన బ్యాంక్ మేనేజర్లకు జగనన్న బడుగు వికాసం సబ్సిడీ రుణాలు ఇచ్చేందుకు ముందుకు రావాలి ఆయన తెలిపారు. ఎంపీడీఓ శ్రీనివాసరరావు, ప్రమీలా రాణి, సుబ్బారావు, లక్ష్మణాచారి, స్త్రీ నిధి నాగబాబు, కె.శోభన్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం

నగరం: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ చెప్పారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రక్తదానం అన్ని దానాల కన్నా గొప్పదన్నారు. డాక్టర్ ఎ.సురేంద్రనాద్ మాట్లాడుతూ రక్తదానం చేయడంవల్ల అనర్థాలు జరుగుతాయనే అపోహలను విద్యార్థులు విడనాడలన్నారు. ఆపద సమయంలో రక్తం అందక ఎంతోమంది ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు రక్త గ్రూప్ పరీక్షలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ పి.వెంకటనారయణ, డాక్టర్ సురేష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు బ్లడ్ కాంపోనెంట్స్ స్టోరేజ్ ప్రారంభం

రేపల్లె రూరల్: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఈ నెల 15వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు రెడ్‌క్రాస్ బ్లడ్ కాంపోనెంట్ స్టోరేజ్ సెంటర్, 10కేవీ సోలార్ పవర్‌ప్లాంట్‌ల ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ రేపల్లె బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావుచే నిర్వహించే ఈకార్యక్రమంలో రెడ్‌క్రాస్ సిబ్బంది, ప్రజలు పాల్గొనాలని కోరారు.



10 లీటర్ల నాటుసారా స్వాధీనం

నిజాంపట్నం: నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడితే సహించేది లేదని నగరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. నిజాంపట్నం దిండి పంచాయతీ అదవల గ్రామంలో బుధవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ తమకు సమాచారం రావడంతో సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామంలో దాడులు చేయడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో కాసుల రాధాకృష్ణ అనేవ్యక్తి దగ్గర 10 లీటర్ల నాటుసారాను గుర్తించడం జరిగిందని తెలిపారు. నాటుసారాను సీజ్ చేసి రాధాకృష్ణను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. నాటు సారా తాగడం వల్ల అనర్థాలు ఉన్నాయని, ప్రజలు నాటుసారా జోలికి పోయి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని తెలిపారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లులు చెల్లించాలి




బాపట్ల: పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుకూలంగా బిల్లులు చెల్లించే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను ఎస్సీ,ఎస్టీ,బీసీ హాస్టల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ డీవీఎస్ నాగరాజు కోరారు. జేఏసీ నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను బుధవారం కలిశారు. ధరలు పెరిగిపోవటంతో హాస్టల్స్ నిర్వహణ కష్టంగా మారిందని తెలిపారు. వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ నాయకులు ముప్పా శ్రీనివాసరావు, గోవింద్, రత్నకుమారి, రాహేల్, సుజాత తదితరులు ఉన్నారు.



డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

రేపల్లె: ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరంలో డిగ్రీ చేర దలచిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీ రవిచంద్రకుమార్ తెలిపారు. స్థానిక కళాశాలలో బుధవారం ఆయన మాట్లాడారు. డిగ్రీ ప్రవేశాలకు ఈనెల 19 నుంచి 24వతేదీ వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేయించుకోవాలని, 26 నుంచి 30వతేదీ వరకు వెబ్ ఆప్షన్‌లను ఎంపిక చేసుకోవాలని చెప్పారు. జూలై 4 నుంచి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయన్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ద్వారా రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్‌లను నమోదు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ విద్యాసంవత్సరం కళాశాలలో బీఏస్సీ-కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ-మ్యాథ్స్, బీఎస్సీ-కెమిస్ట్రీ, బీఎస్సీ-జువాలజీ, బీకాం - కంప్యూటర్ అప్లికేషన్స్, బీఏ-హిస్టరీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. పూర్తి వివరాలకై కళాశాలలో సంప్రదించవచ్చని చెప్పారు.



























సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పట్నంబజారు: విద్యా కానుక కిట్లు అందించిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం గుంటూరులో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.1,300, గరిష్ట ధర రూ.3,000, మోడల్ ధర రూ.1,700 వరకు పలికింది.

ముఖేష్‌కు స్వర్ణం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): నేషనల్ రైఫిల్ షూటింగ్ ఆధ్వర్యంలో భోపాల్‌లో జరుగుతున్న నేషనల్ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో గుంటూరుకు చెందిన నేలవల్లి ముఖేష్ 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ జూనియర్ విభాగంలో బంగారు పతకం సాధించాడని చీఫ్ కోచ్ ఎన్.సుబ్రమణ్యం తెలిపారు.



న్యూస్‌రీల్

23న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈనెల 23న నిర్వహించేందుకు జెడ్పీ సీఈవో జె.మోహనరావు బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. మొత్తం ఏడు స్థాయీ సంఘాలకు 1,2,4,7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్నాయి. వీటిలో ప్రణాళిక-ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యంతోపాటు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలు ఉన్నాయి. అదే విధంగా 3వ స్థాయీ సంఘానికి సంబంధించిన సమావేశం వ్యవసాయంపై జెడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, స్త్రీ-శిశు సంక్షేమంపై తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి అధ్యక్షతన 5వ స్థాయీ సంఘం, సాంఘిక సంక్షేమంపై జెడ్పీ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన 6వ స్థాయీ సంఘ సమావేశం జరగనున్నాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన స్థాయీ సంఘాల్లో సభ్యులుగా ఉన్న జెడ్పీటీసీలతో పాటు ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకానున్నారు.

విక్రయానికి మిర్చి విత్తనాలు

గుంటూరు రూరల్: రైతుల కోసం లాంఫాంలో మిర్చి విత్తనాలు విక్రయానికి సిద్ధం చేశామని ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె. గిరిధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌సీఏ 657, 643 మిరప రకాలు ఫౌండేషన్ విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. ఆసక్తిగల రైతులు నేరుగా ఉద్యాన పరిశోధన స్థానం లాంఫాంలో 15వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 4 గంటలలోపు కొనుగోలు చేసుకోవచ్చన్నారు. ఒక రైతుకు 100 గ్రాములు మాత్రమే ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. 100 గ్రాముల ప్యాకెట్ ధర రూ.120 అని తెలిపారు. ఈ విత్తనాలు నారు పెంచుకుని నాటు వేసుకోవాలని తెలిపారు.

ఊయలలో నిద్రిస్తుండగా ఆహుతి



సజీవ దహనమై మసిబారిన చిన్నారి మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

అచ్చంపేట: పొలాల్లో వృథాగా పడి ఉన్న చెత్తాచెదారాన్ని తగలబెడుతుండగా నిప్పురవ్వలు ఎగసి వచ్చి పడటంతో 14 పూరిళ్లు దగ్ధమయ్యాయి. పెదపాలెంలో బుధవారం సాయంత్రం జరిగిన ఈ దుర్ఘటనలో 14నెలల చిన్నారి సజీవదహనమైంది. మరో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి ఆనుకుని ఉన్న పొలాలలో వ్యర్థాలను తగలబెట్టే క్రమంలో గాలికి నిప్పురవ్వలు వచ్చి పక్కనే ఉన్న పూరిళ్లపై పడ్డాయి. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. ముందుగా జెర్రిపోతు వెంకట్రావు ఇంటికి నిప్పు అంటుకుంది. 14నెలల వెంకట్రావు కుమార్తె పల్లవి ఉయ్యాలలో నిద్రిస్తుండగానే మంటల్లో సజీవ దహనమైంది. చిన్నారిని రక్షించేందుకు తల్లి అనిత, అమ్మమ్మ మేరమ్మ, మరో ఇద్దరు తీవ్రంగా యత్నించినా ఫలితం లేకుండా పోయింది. వారు తీవ్రంగా గాయపడ్డారు. ఆ తర్వాత అగ్నికీలలు క్షణాల వ్యవధిలో గంటిల శివప్రసాద్, జడ సుందరరావు, నల్లూరి తిరుపతయ్య, నల్లూరి నిర్మల, గంటిల పేరయ్య, జడ నాగేశ్వరరావు, జడ ఏసయ్య, గంటా స్వామి, కోఫూరి పోతురాజు, కోఫూరి జ్యోతిర్మయి, జడ రామారావు, జడ రవి, నల్లూరి కోటయ్య ఇళ్లకూ పాకాయి. ఆ ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. క్రోసూరు, సత్తెనపల్లి నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపే నష్టం జరిగిపోయింది. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. సర్పంచ్ నెల్లూరి హరిబాబు, మాజీ సర్పంచ్ చంద్రబాబు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని 108లో సత్తెనపల్లి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నర్సరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం: జేసీ

విషయం తెలుసుకున్న జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆర్డీఓ రాజకుమారి, తహసీల్దారు పద్మాదేవితో కలిసి ఘటనాస్థలానికి వచ్చారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. అన్నివిధాలా ఆదుకుంటామని ధైర్యం చెప్పారు. తక్షణ సహాయంగా ఒక్కొక్క కుటుంబానికి రూ.5వేల నగదు, 25కిలోల బియ్యం, కిలో కంది పప్పు, వంట దినుసులు, కూరగాయలు, వంట సామగ్రి అందించారు. అందరికీ ఇప్పుడు ఉంటున్న స్థలంలోనే పక్కా గృహాలు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు.



వెల్‌'సెట్'

ఏపీ ఈఏపీ సెట్‌లో ఉమ్మడి జిల్లా విద్యార్థుల సత్తా

- ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో రాష్ట్రస్థాయిలో ర్యాంకులు కైవసం
- గుంటూరులో చదివిన నందిగామ విద్యార్థికి ఇంజినీరింగ్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. మెరుగైన ర్యాంకులు సాధించారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో రాష్ట్ర స్థాయి టాప్-10తోపాటు 100లోపు ర్యాంకులను కై వసం చేసుకున్నారు. ఇంజినీరింగ్ విభాగంలో పిడుగురాళ్లకు చెందిన నందిపాటి సాయి దుర్గారెడ్డి 3వ ర్యాంకు, చిలకలూరిపేటకు చెందిన అడ్డగడ్డ వెంకట శివరామ్ 6వ ర్యాంకు, గుంటూరుకు చెందిన వై.మణీధర్‌రెడ్డి 7వ ర్యాంకు సాధించారు. గుంటూరులో చదివిన ఎన్టీఆర్ జిల్లా నందిగామకు చెందిన చల్లా ఉమేష్ వరుణ్ రాష్ట్రస్థాయి ఫస్ట్ ర్యాంకు సాధించడం గర్వకారణం. అలాగే అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో తెనాలి విద్యార్థి దుగ్గెంపూడి కార్తికేయరెడ్డికి 5వ ర్యాంకు లభించింది.

వందలోపు ర్యాంకులివీ..

ఇంజినీరింగ్‌లో వినుకొండకు చెందిన వెలమకన్ని సాత్విక్ 30వ ర్యాంకు, భట్టిప్రోలుకు చెందిన ఐనంపూడి హర్షిత 47, ఈసూరుకు చెందిన గూడూరు ఆదర్శ్ 53, గుంటూరులోని పట్టాభిపురానికి చెందిన నాదెళ్ల మోహిత్ సాయి 84, తాడేపల్లికి చెందిన దుగ్గిరాల యశస్విని 98, గుంటూరులోని వికాస్‌నగర్‌కు చెందిన గుంటి మురళీకృష్ణ 105, నవభారత్‌నగర్‌కు చెందిన ఆలోకం వరుణ్ 145, రేపల్లె విద్యార్థి ఎన్.వివేక్ వర్ధన్ 176, శ్రీకృష్ణదేవరాయ నగర్‌కు చెందిన వెలినేని హర్ష వైష్ణవ్ 207వ ర్యాంకు సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో గుంటూరులోని ఏటీ అగ్రహారానికి చెందిన డి.సాయి చిద్విలాస్‌రెడ్డి 19వ ర్యాంకు, పొన్నూరుకు చెందిన జి.అలేఖ్యదేవి 28, గుంటూరుకు చెందిన పి.రూపేష్ కుమార్ 52, మద్ది నాగ శ్రీఆదిత్య 55, మొగల్ షాజారున్నీసా 58, దుగ్గిరాల వీపీఆర్ సాయి మోహిత్ 64, రెంటచింతలకు చెందిన నల్లబోతు నాగలక్ష్మి 65, మేడికొండూరుకు చెందిన బండ్లమూడి చరితశ్రీ 73, గుంటూరుకు చెందిన నూతక్కి సాత్విక 86వ ర్యాంకు సాధించారు.

ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యం



మా స్వస్థలం ప్రకాశం జిల్లా మార్కాపురం. ప్రస్తుతం గుంటూరులోనే ఉంటున్నాం. నాన్న శ్రీనివాసరెడ్డి వ్యవసాయం చేస్తారు. అమ్మ అనురాధ గృహిణి. సీనియర్ ఇంటర్‌లో 971 మార్కులు సాధించా. ఇటీవల తెలంగాణ ఎంసెట్‌లో 2వ ర్యాంకు సాధించాను. ఐఐటీలో చదవాలనే లక్ష్యంతో కాలేజీలో ఇచ్చిన ప్రణాళిక ప్రకారం రోజుకు 12 గంటల పాటు చదివాను. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు వస్తుందని ఎదురు చూస్తున్నాను.

– యక్కంటి మణీధర్‌రెడ్డి, ఇంజినీరింగ్ 7వ ర్యాంకు, గుంటూరు

విద్యా'కీర్తి'



అద్దంకి రూరల్: వ్యవసాయ కుటుంబంలో జన్మించి కష్టపడి చదివిన అద్దంకి మండలంలోని కొంగపాడు గ్రామానికి చెందిన గుడిపూడి హరిబాబు కుమార్తె కీర్తి ఏపీఈఏపీ సెట్‌లో సత్తా చాటింది. 147.70 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 8 ర్యాంకు సాధించింది. ఉత్తమ ర్యాంకు సాధించిన కీర్తిని గ్రామస్తులు, అధ్యాపకులు అభినందించారు.

శభాష్ వెంకట తేజ



వెంకటతేజకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

చీరాల అర్బన్: ఆంధ్ర, తెలంగాణ ఎంసెట్ ఫలితాలతోపాటు నీట్ పరీక్షలోనూ ప్రతిభ కనబరిచాడు చీరాల మండలం దేవాంగపురికి చెందిన నాసిక వెంకట తేజ. ఏపీ ఈఏపీ సెట్‌లో అగ్రికల్చర్, ఫార్మసీలో 24వ ర్యాంకును సాధించాడు. ఇటీవల తెలంగాణ ఎంసెట్‌లో 2వ ర్యాంకు, నీట్‌లో 511 ర్యాంకు సాధించి శభాష్ అనిపించుకున్నాడు.

చేనేత కుటుంబం నుంచి

వెంకట తేజ తల్లిదండ్రులు సుధాకర్‌బాబు, శ్రీదేవి. మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నారు. కొడుకును కష్టపడి చదివిస్తున్నారు. 'సాక్షి'తో వెంకట తేజ మాట్లాడుతూ డాక్టర్ అవ్వాలనేది తన లక్ష్యమని చెప్పాడు.

రైతు బిడ్డకు స్టేట్ 3వ ర్యాంక్



పిడుగురాళ్ల రూరల్: నందిపాటి నారపరెడ్డి, దుర్గమ్మలది రైతుకూలీ కుటుంబం. వీరి కుమారుడు నందిపాటి సాయి దుర్గా రెడ్డి ఏపీ ఈఏపీ సెట్‌లో స్టేట్ 3వ ర్యాంక్ సాధించాడు. తాను పడుతున్న కష్టం కుమారుడు పడకూడదనే ఉద్దేశంతో నారపరెడ్డి కుమారుడిని విజయవాడ, హైదరాబాద్ నగరాల్లో హాస్టళ్లలో ఉంచి చదివించారు. తండ్రి ఆశయం మేరకు సాయిదుర్గారెడ్డి కష్టపడి చదివి ఏపీఈఏపీ సెట్ ఇంజినీరింగ్ విభాగంలో స్టేట్ 3వ ర్యాంక్‌లో నిలిచాడు. తెలంగాణ ఎంసెట్‌లోనూ 18వ ర్యాంకుతో మెరిశాడు. ఐఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేసి, ఎంటెక్ చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షిస్తున్నట్టు సాయిదుర్గారెడ్డి చెప్పాడు.

మెగా జాబ్‌మేళాను ఉపయోగించుకోవాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల : బాపట్ల జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ మెగా జాబ్‌మేళా ఆధ్వర్యంలో ఈ నెల 16న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జాబ్ మేళా కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. నగరంలోని ఎస్‌వీఆర్ఎం కాలేజీలో జాబ్‌మేళా ఉంటుందని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ మాట్లాడుతూ జాబ్‌మేళాకు 20కు పైగా ప్రముఖ బహుళ జాతీయ కంపెనీలు హాజరవుతున్నాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, ఫార్మసీ, పీజీ, బీటెక్ ఇలా అర్హతలు ఉన్న అభ్యర్థులు హాజరు కావాలని కోరారు. వివరాలకు 90323 84374, 85559 01198, 99669 19485 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రతి రక్తపుబొట్టూ సద్వినియోగం కావాలి

ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



రక్తదాన శిబిరాన్ని రిబ్బన్ కట్‌చేసి ప్రారంభిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి సతీమణి వై.ఉమాదేవి

నరసరావుపేట: రక్తదాన శిబిరాల ద్వారా సేకరించిన ప్రతి రక్తపు బొట్టూ సద్వినియోగమయ్యేలా చూడాలని ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి రెడ్‌క్రాస్ ప్రతినిధులకు సూచించారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఏపీ వైద్య విధాన పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన రక్తదాన శిబిరాన్ని ఎస్పీ సతీమణి ఉమాదేవి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఎస్పీ రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ రక్తదానం ఎంతో మిన్న అని పేర్కొన్నారు. ప్రజలు, యువత రక్తదానానికి ముందుకు రావాలని సూచించారు. రక్తదానం చేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది, మహిళా పోలీసులు, యువతను అభినందించారు. ఉమాదేవి మాట్లాడుతూ జిల్లా పోలీసు విభాగం రక్తదాన శిబిరానికి సహాయసహకారాలు అందజేయటం ఎంతో గొప్పవిషయమని, ఈ శిబిరాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడం ఆరోగ్యానికి ఎంతో మంచిదని చెప్పారు. ప్రజలు అపోహలు విడనాడి రక్తదానం చేయాలన్నారు. శిబిరం నిర్వహణకు సహాయం అందించిన ఎస్పీ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రెడ్‌క్రాస్ ప్రతినిధులు, పోలీసు అధికారులు ఎస్పీ దంపతులను సన్మానించారు. 53 ఏళ్ల వయస్సులో 54సార్లు రక్తదానం చేసిన నరసరావుపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.భక్తవత్సలరెడ్డి, 21సార్లు రక్తదానం చేసిన ఏఎన్ఎస్ కానిస్టేబుల్ ఎల్.శ్రీనివాసరావు, ఆరుసార్లు రక్తదానం చేసిన ఉమెన్ కానిస్టేబుల్ ఐ.కీర్తి, 29సార్లు రక్తదానం చేసిన గాయత్రి ఎల్ల క్లానిక్స్ యజమాని యన్నం శ్రీనివాసరెడ్డిని ఎస్పీ, నిర్వాహకులు సన్మానించారు. ఈ శిబిరంలో మొత్తం 226 మంది రక్తదానం చేశారు. అదనపు ఎస్పీ(ఏఆర్) డి.రామచంద్రరాజు, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, డీఎంహెచ్‌వో డాక్టర్ జి.శోభారాణి, క్రైమ్ అదనపు ఎస్పీ ఎస్.కే చంద్రశేఖర్, డీఎస్పీ కేవీ. మహేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. రెడ్‌క్రాసు సొసైటీ వైస్‌చైర్మన్ పీవీఎం. శరత్ బాబు, కార్యదర్శి మురళి, మేనేజింగ్ కమిటీ సభ్యులు కేవీఎస్ఎన్ శ్రీనివాసగుప్తా, బత్తుల మురళీ, ప్రభుత్వ వైద్యశాల ఆర్ఎంవో డాక్టర్ దయానిధి, డాక్టర్ సృజన, గెల్లి వీరారెడ్డి పాల్గొన్నారు.

మత్స్యసిరులు ఎగసి పడవ..

తొలివేటపై గంపెడాశలు

- వేటకు బయలుదేరిన బోట్లు
- రెండు నెలల సుదీర్ఘ విరామం తరువాత సంద్రంబాట
- జూన్ 14తో ముగిసిన వేట నిషేధ గడువు
- హార్బర్‌లో సందడి వాతావరణం
- మొగ సామర్థ్యం పెంపుతో మత్స్యకారుల్లో ఆనందం



వేటకు వెళ్లేందుకు సామగ్రిని సిద్ధం చేసుకుంటున్న గంగపుత్రులు

రేపల్లె/చీరాల సుదీర్ఘ విరామం తరువాత సముద్రంలో వేటకు గంగపుత్రులు గురువారం నుంచి పయనమవుతున్నారు. మత్స్య సంపద వృద్ధిని దృష్టిలో ఉంచుకుని మార్చి 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజులు వేటపై ప్రభుత్వం నిషేధం విధించిన విషయం తెలిసిందే. దీంతో జూన్ 15 నుంచి మత్స్యకారులు తిరిగి సముద్రంలోకి వేటకు వెళ్లేందుకు సర్వంసిద్ధం చేసుకున్నారు. బుధవారం ముహూర్తం బాగుండటంతో తమ ఇష్టదైవాలకు పూజలు చేసి గంపెడు ఆశలతో తొలి వేటకు పయనమయ్యారు. ఏటా వేటనిషేధ కాలం ముగిసిన తర్వాత చేసే తొలి వేటలో మత్స్యసిరులు అపారంగా పడతాయని మత్స్యకారుల నమ్మకం. దీంతో హార్బర్ ప్రాంగణం సందడిగా మారింది.

బోట్లకు మరమ్మతులు పూర్తి

వేట నిషేధ సమయంలోనే గంగపుత్రులు బోట్లకు మరమ్మతులు పూర్తి చేసుకున్నారు. రంగులు వేయించారు. వలలను సరిచేసుకున్నారు. వేటకు వెళ్లేందుకు ఉప్పు, ఐస్, తాగునీరు, వంట సామగ్రి, డీజిల్ తదితరాలు సిద్ధం చేసుకున్నారు. వేట నిషేధ సమయంలో వీరికి వైఎస్సార్ మత్స్యకార భరోసా రూ.పదివేలు ఆసరాగా నిలిచింది.



సముద్రంలో వేటకు బయలుదేరుతున్న మత్స్యకారులు(ఫైల్)

మొగ వద్ద సాఫీగా...

హార్బర్ రెండో దశ పనుల్లో భాగంగా సముద్రంలోకి రాకపోకలు సాగించే మొగ సామర్థ్యం పెంపు చేపట్టడంతో ఆ ప్రదేశంలో బోట్లు సాఫీగా సాగిపోతున్నాయి. దీంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నారు. వాస్తవానికి గతంలో మొగ సామర్థ్యం చాలక బోట్ల రాకపోకలకు ఆటంకాలు కలిగేవి. సముద్రంలోకి వెళ్లేందుకు ఎన్నో గంటల సమయం వేచి ఉండాల్సి వచ్చేది. ఒక్కొక్కసారి మొగ వద్ద బోట్ల అడుగు భాగం నేలకు తగిలి అవి దెబ్బతినేవి. హార్బర్ రెండో దశ పనులు చేపట్టడంతో మొగసామర్థ్యం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఫలితంగా ఇప్పుడు బోట్లు సాఫీగా రాకపోకలు చేయగలుగుతున్నాయి.

బాపట్ల జిల్లాలో ఇలా..

తీరప్రాంత విస్తీర్ణం	76 కిలోమీటర్లు
మత్స్యకారులు	50,000
వేటపై ఆధారపడిన వారు	25,000
మత్స్యకార కుటుంబాలు	9,600
మొత్తం వేట బోట్లు	2,924కుపైగా

వరాల రేడు సీఎం



హార్బర్ అభివృద్ధికి ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు తొలి నుంచి కృషి చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకోవటంతో మొగ వద్ద ఇబ్బందులు తప్పాయి. సీఎం జగన్ మత్స్యకారుల హృదయాల్లో వరాల రేడుగా చిరస్థాయిగా నిలిచిపోతారు.

– కె.వెంకటేశ్వరరావు(కేవీఆర్), బోటు ఓనర్, నిజాంపట్నం

వేట ఆనందంగా చేసుకుంటాం



నిజాంపట్నం హార్బర్ అభివృద్ధి పనులు వరంగా మారాయి. గతంలో మొగ వద్ద బోట్ల రాకపోకలకు ఆటంకాలు ఉండేవి. ఇప్పుడు తొలగిపోయాయి. ఇది ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమే. ఇక వేట ఆనందంగా చేసుకుంటాం.

– కన్నా శ్రీనివాసరావు, బోటు ఓనర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, నిజాంపట్నం

సీఎం మేలు మరువలేం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలులను గంగపుత్రులు మరువలేరు. మొగ సామర్థ్యం పెంపు పనులు చేపట్టడం వల్ల మా కష్టాలన్నీ తొలగిపోయాయి. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు కృషి ప్రశంసనీయం. వేట ఇక హాయిగా సాగుతుంది.

మోపిదేవి శ్రీనివాసరావు, బోటు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, నిజాంపట్నం

చట్టప్రకారం ప్రొ'సీడ్'

- విత్తన చట్టాలపై అవగాహన అవసరం
- లైసెన్స్ ఉంటేనే ప్రైవేటుగా విత్తనాల విక్రయం
- రశీదు తప్పనిసరిగా పొందాలి
- 2,733 ప్రైవేట్ డీలర్ల దుకాణాలు



సత్తెనపల్లిలోని విత్తనాల దుకాణంలో తనిఖీలు చేపడుతున్న ఏడీఏ శ్రీధర్‌రెడ్డి(ఫైల్)

సత్తెనపల్లి: జిల్లాలో ఖరీఫ్ పనులు ముమ్మరమవుతున్నాయి. ప్రైవేటు దుకాణాల్లోనూ విత్తనాల విక్రయాలు జోరందుకున్నాయి. క్రయవిక్రయాలు అధికంగా జరిగే ఈ సీజన్‌లో రైతులు మోసపోయే అవకాశాలూ ఎక్కువే. విత్తన చట్టంపై అవగాహన పెంచుకుంటే ఎలాంటి అవస్థలూ ఉండవని నిపుణులు సూచిస్తున్నారు. ఈ చట్టం ద్వారా విత్తనాలు కొనే రైతుకు ఎలాంటి అన్యాయం జరిగినా సంబంధిత విత్తనాల డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటారు. విత్తన చట్టం 1966, విత్తన నిబంధనలు 1968, విత్తన నియంత్రణ ఉత్తర్వులు 1983 తదితర చట్టాలను సమ్మిళితం చేసి విత్తన పరమైన అతిక్రమణలు, ఉల్లంఘనలు వర్తించేలా ఈ చట్టాన్ని రూపొందించారు. విత్తన విక్రయాల్లో మోసాలకు పాల్పడిన వారిపై విత్తన నియంత్రణ ఉత్తర్వులు-1983 క్లాజు ప్రకారం ఆయా దుకాణాల్లో విత్తనాలను జప్తు చేయడంతో పాటు అత్యవసర సరుకుల చట్టం 1955 సెక్షన్-ఏ ప్రకారం జరిమానా కూడా విధిస్తారు. జిల్లాలో 2,733 ప్రైవేట్ డీలర్ల దుకాణాలు ఉన్నాయి. వాటిలో 420 మంది విత్తనాల విక్రయాల డీలర్లు, 978 మంది ఎరువుల విక్రయాల డీలర్లు, 1,335 మంది పురుగు మందుల విక్రయాల డీలర్లు ఉన్నారు.

స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలి

విత్తన దుకాణాల్లో కచ్చితంగా ధరలు, స్టాకు బోర్డులను ఏర్పాటు చేయాలి. లేకుంటే విత్తన నియంత్రణ ఉత్తర్వులు-1983 క్లాజు 8 ప్రకారం దుకాణాల్లో విత్తన విక్రయాలు నిలుపుదల చేస్తారు. అధికారులు ఇచ్చిన నోటీసులకు సరైన సమాధానం ఇవ్వకపోతే లైసెన్సు రద్దు చేస్తారు.

లేబుల్ లేకపోతే..

ప్రైవేట్ వ్యాపారి వద్ద కొన్న విత్తనాల బస్తాలకు లేబుల్ లేకపోతే విత్తన చట్టం-1966 సెక్షన్ 7 ప్రకారం చర్యలు చేపట్టవచ్చు. విత్తనాలను జప్తు చేసే అధికారం ఉంది. అత్యవసర సరుకుల చట్టం - 1955 సెక్షన్ 7 ప్రకారం జరిమానా విధిస్తారు.

నిబంధనలు పాటించాల్సిందే

విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలి. విత్తనాలు ఎంత ఉన్నాయి? ధరలు తెలిసేలా దుకాణంలో బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం పొందు పరిచిన విత్తన చట్టానికి అనుగుణంగా ప్రైవేట్ విత్తనాల డీలర్లు విత్తనాలను విక్రయించాలి. ఆ విషయంలో ఆయా డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే భారీగా జరిమానాతో పాటు దుకాణాల లైసెన్సును పోగొట్టుకునే పరిస్థితి ఉంది.

– ఐ.మురళి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, పల్నాడు

- కాలం చెల్లిన విత్తనాలు అమ్మితే విత్తన చట్టం -1988 సెక్షన్ 7 ప్రకారం విత్తన నియంత్రణ ఉత్తర్వులు - 1983 క్లాజు 8 ను అనుసరిస్తూ డీలర్ లైసెన్సు సస్పెండ్ / రద్దు చేయవచ్చు.


రశీదు ఇవ్వాల్సిందే

విత్తనాలు కొన్న రైతులకు ఆయా దుకాణదారుడు కచ్చితంగా రశీదు ఇవ్వాలి. లేకుంటే విత్తన నియంత్రణ ఉత్తర్వులు-1983 క్లాజు 9 ప్రకారం ఆయా దుకాణదారునికి ముందుగా నోటీసు జారీ చేసి దానికి సరైన సమాధానం ఇవ్వకపోతే ఆయా డీలర్ లైసెన్సును సస్పెండ్/ రద్దు చేయవచ్చు.

లైసెన్స్ ప్రదర్శన తప్పనిసరి

ప్రైవేట్ విత్తనాల విక్రయ దుకాణాల్లో తప్పనిసరిగా విత్తన లైసెన్సును ప్రదర్శించాలి. అలా లేకుంటే ఆ దుకాణంలో విత్తనాల విక్రయాలను నిలిపివేయవచ్చు. అంతేకాక నోటీసు ఇస్తూ దానికి సరైన సమాధానం ఇవ్వకపోతే విత్తన నియంత్రణ ఉత్తర్వులు -1983 క్లాజు 5 ప్రకారం డీలర్ లైసెన్సు సస్పెండ్/ రద్దు చేయవచ్చు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 520.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 450 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.20 అడుగుల వద్ద ఉంది.

ఇంటర్ ఆర్‌ఐఓగా జుబేర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ విద్య ఆర్‌ఐఓగా జుబేర్ బాధ్యతలు స్వీకరించారు. పిట్టలవానిపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న జుబేర్‌ను ఆర్‌ఐవోగా పూర్తి అదనపు బాధ్యతలపై (ఎఎఫ్‌సీ) ఇంటర్మీడియెట్ బోర్డు నియమించింది. ఇప్పటి వరకు ఆర్‌ఐవోగా పని చేసిన జి.సునీత తిరిగి తన మాతృస్థానమైన గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వెళ్లారు.

జోరుగా మిర్చి అమ్మకాలు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 50,407 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 46,994 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,500 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాల్‌కు రూ.9,500 నుంచి 23,000 వరకు ధర లభించింది. ప్రకత్యేక రకాల మిర్చికి రూ. 10,500 నుంచి రూ. 25,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,286 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

● **నగరంపాలెం:** జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో గస్తీ ముమ్మరం చేయాలని గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఆదేశించారు. మంగళవారం అర్ధరాత్రి ఆయన ఆకస్మికంగా పర్యటించారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో, హిందూ కళాశాల కూడలి, శ్రీనివాసరావుపేట ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు.

సంక్షేమ పథకాలన్నీ అమలు చేసిన సీఎం జగన్

మంత్రి మేరుగ నాగార్జున

పర్చూరు(చినగంజాం): రాష్ట్రంలో సంక్షేమ పథకాలన్నింటినీ అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డిదేనని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్నారని, 2024 లో తిరిగి ఆయనను సీఎంగా ప్రజలు ఎన్నుకుంటారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. బుధవారం పర్చూరులో నూతనంగా నిర్మించిన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అతని కుమారుడు లోకేష్‌లకు అధికార దాహం పట్టుకుందని, అందుకే పత్రికల్లో పిచ్చి రాతలు రాయిస్తున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు వారాహితో కలిసి ఎన్ని కుయుక్తులు పన్నినా రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. పర్చూరు ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమవుతుందని, ఇచ్చిన హామీలన్ని నెరవేర్చిన ఏకైక సీఎం ఆయనేనని కొనియాడారు. తాను నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలు స్వీకరించిన నాలుగు నెలల కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 94 గ్రామాల్లో పారిశుద్ధ్య డ్రైనేజీ లేదని, 106 ఫిల్టర్ బెడ్లు కూడా పనిచేయడం లేదన్నారు. బాపట్ల అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, కారంచేడు ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, కన్వీనర్ దండా చౌదరి, తోకల కృష్ణమోహన్, ముప్పాళ్ల రాఘవ, అకుల హేమంత్, నూర్ అహ్మద్, తమ్మా అమ్మిరెడ్డి, గాదె సురేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

35 బృందాలతో విద్యుత్ తనిఖీలు

- 94 కేసులు నమోదు
- రూ.5.31లక్షల అపరాధ రుసుము జరిమాన

నిజాంపట్నం: విద్యుత్ వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి సహకరించాలని విజిలెన్స్ డీఈ కేఎల్ మూర్తి కోరారు. బాపట్ల విద్యుత్‌శాఖ డీఈ ఆంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం నిజాంపట్నం మండలంలో 35 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 94 కేసులు నమోదు చేసి రూ.5లక్షల 31వేల అపరాధ రుసుం జరిమానా విధించినట్లు తెలిపారు. అక్రమ విద్యుత్ వినియోగం చట్టరీత్యా నేరమని అలాంటి చర్యలకు పాల్పడితే ఎంతటివారైనా చట్టపరమైన చర్యలు తప్పవరి హెచ్చరించారు. వినియోగ దారులు సకాలంలో తమ తమ కరెంటు బిల్లులను చెల్లించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బాపట్ల డీఈ ఆంజనేయులు, చెరుకుపల్లి ఏడీఈ శ్యామ్ సుందర్‌బాబు, శంకర్, సతీష్, పలువురు విద్యుత్‌శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దిశయాప్ చెంత ఉంటే పోలీసు రక్షణ ఉన్నట్లే..

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల: దిశ యాప్ మీ చెంత ఉంటే మీకు రక్షణగా పోలీసు ఉన్నట్లేనని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. దిశ యాప్ ప్రత్యేక డ్రైవ్‌ను బుధ, గురువారాల్లో జిల్లాలో నిర్వహించారు. యాప్ డ్రైవ్‌ను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేకంగా పరిశీలించారు. జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్లు, సచివాలయాల్లోని మహిళా పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. గ్రామాలు, బస్టాండ్, రైల్వేస్టేషన్, ముఖ్యమైన కూడళ్లు, కాలేజీలు, స్కూల్‌లు, ఫ్యాక్టరీలలో దిశ యాప్ డౌన్లోడ్ వర్క్‌షాప్ నిర్వహించి ప్రజలకు దిశ యాప్‌పై విస్తృతంగా అవగాహన కల్పించారు. దిశ యాప్‌లో 100, 112 వంటి అత్యవసర నెంబర్లతోపాటు పోలీస్‌స్టేషన్లు, ఆసుపత్రులు, మెటర్నిటీ సెంటర్లు, బ్లడ్ బ్యాంకులు, ట్రామా కేర్ సెంటర్లు, మెడికల్ షాపుల వివరాలు పొందుపరచివున్నాయని తెలిపారు. దిశ యాప్ కేవలం మహిళలకే కాకుండా ప్రతి ఒక్కరికీ ఉపయోగపడుతుందన్నారు. దిశ యాప్ మీ ఫోన్లో ఉంటే మీ చుట్టూ 10 మంది పోలీస్ ల రక్షణ ఉన్నట్లేనని తెలిపారు.


దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్న సీఐ వేణుగోపాల్‌రెడ్డి

ఏపీ ఈఏపీ సెట్‌లో సత్తా చాటిన పెదపులుగువారిపాలెం విద్యార్థి


లోకేశ్వరరెడ్డికి స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు మొగదారమ్మ, శ్రీనివాసరెడ్డి

కర్లపాలెం: ఏపీఈఏపీ సెట్‌లో బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం పెదపులుగువారిపాలెం గ్రామానికి చెందిన పులుగు లోకేశ్వరరెడ్డి 137వ ర్యాంకు సాధించి సత్తాచాటాడు. పెదపులుగువారిపాలెం గ్రామానికి చెందిన పులుగు శ్రీనివాసరెడ్డి, మొగదారమ్మల పెద్ద కుమారుడు లోకేశ్వరరెడ్డి ఏపీఈఏపీ సెట్‌లో 136.9116 మార్కులతో 137వ ర్యాంకు సాధించాడు. ఇటీవల వెలువడిన జేఈఈ మెయిన్స్‌లో ఓపెన్ కేటగిరిలో 926వ ర్యాంకు సాధించాడు. లోకేశ్వరరెడ్డి తండ్రి ప్రైవేటు లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. తల్లి గృహిణి. లోకేశ్వరరెడ్డి నర్సరీ నుంచి 1వ తరగతి వరకు హైవెండ్ హైస్కూల్‌లో, 2 నుంచి 5వరకు కర్లపాలెం పబ్లిక్ స్కూల్‌లో, 6నుంచి 8వరకు బాపట్ల శ్రీచైతన్య కళాశాలలో, 9 నుంచి 10 వరకు విజయవాడ శ్రీ చైతన్య ఐపీఎల్ క్యాంపస్‌లో, ఇంటర్మీడియట్ విజయవాడ శ్రీచైతన్యలో చదివాడు. ఐఐటీలో ర్యాంకు సాధించి బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ చదివి మంచి ఉద్యోగం చేయాలని లక్ష్యంతో ఉన్నట్లు లోకేశ్వరరెడ్డి తెలిపాడు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రాణించాలని ఉంది



దుర్గి : ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో మండలానికి చెందిన ఉన్నం అజయ్ రాష్ట్రస్థాయిలో 60వ ర్యాంకు సాధించి తన సత్తా చాటాడు. మండలంలోని ఓబులేశునిపల్లె గ్రామానికి చెందిన ఉన్నం పార్వతయ్య వెంకటనరసమ్మ దంపతులు వ్యవసాయ కుటుంబానికి చెందిన వారు. వారి కుమారుడు అజయ్ చిన్నతనం నుంచి చదువుల్లో రాణిస్తున్నాడు. గత వారం రోజుల కిందట వెలువడిన తెలంగాణ ఎంసెట్ ఫలితాలలోనూ 73 ర్యాంకు సాధించి విద్య పట్ల తన అభిరుచిని చాటుకున్నారు. పలువురు గ్రామస్తులు అభినందించారు.

నీట్‌లో శ్రీ చైతన్యకు ర్యాంకుల పంట


ఎం.ముని

రేపల్లె: ప్రభుత్వం విడుదల చేసిన నీట్ పరీక్షలలో చైతన్య కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు కళాశాల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం దుర్గాప్రసాద్ తెలిపారు. స్థానిక కళాశాలలో బుధవారం విద్యార్థులకు నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎం.ముని 607 మార్కులతో 522వ ర్యాంకు సాధించాడని, యు.హేమంత్ 497 మార్కులతో 50642వ ర్యాంకు సాధించాడని తెలిపారు. డీన్ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ ఓ.రజనిబాబు, వైస్ ప్రిన్సిపాల్ తిరుమలరావు, అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు.